ఏఎస్పీగా మనీషా బాధ్యతల స్వీకరణ

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఎస్పీగా మనీషా వంగలరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా గ్రేహౌండ్స్ నుంచి ఆమె జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, మాదవద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.



ఎస్పీకి పూలమొక్క ఇస్తున్న ఏఎస్పీ మనీషా

ఒడిశా ఆర్టీసీ బస్సు దగ్ధం

- విజయనగరం నుంచి వొమ్మరకోట వెళ్తుండగా ఘటన
- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు



ఘాట్‌రోడ్డులో దగ్ధమవుతున్న ఒడిశా ఆర్టీసీ బస్సు

సాలూరురూరల్/పాచిపెంట/సాలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనను మరిచిపోకముందే సాలూరు సమీపంలో ఏవోబీ ఘాట్ రోడ్డులో ఒడిశా ఆర్టీసీకి చెందిన ప్రత్యేక బస్సు అగ్నికి ఆహుతైంది. అయితే, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కార్తీక పౌర్ణమి నేపథ్యంలో ఒడిశా ఆర్టీసీ గత రెండు రోజులుగా విజయనగరం నుంచి వొమ్మరకోట(ఒడిశా)కు ప్రత్యేక బస్సును నడుపుతుంది. ఈ బస్సు విజయనగరంలో గురువారం ఉదయం 5 గంటలకు బయలుదేరింది. ఈ బస్సు సాలూరు చేరుకునే సరికి అందులో తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నారు. అక్కడ మరో ప్రయాణికుడు ఎక్కాడు. డ్రైవర్ సుబీర్ హరిజన్, కండక్టర్ భూపేంద్ర సాహుతో సహా మొత్తం 12 మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. బస్సు కోనవలస దాటిన తరువాత తూర్పు కనుమలు ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తుండగా ఇంజన్ వద్ద పొగలు రావడాన్ని డ్రైవర్ గుర్తించాడు. కొద్ది దూరం ప్రయాణించి రొడ్డవలస వద్ద ఉదయం 7.20 గంటలకు బస్సును పక్కకు (మిగతా 6వ పేజీలో..)

ఘటనపై ఆరా తీసిన మంత్రులు

పార్వతీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా ఆర్టీసీ బస్సు దగ్ధకావడంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒడిశా బస్సులపై దృష్టి పెట్టాలని, వాటిని తనిఖీ చేయాలని ఆదేశించారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి: ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా ఆర్టీసీ బస్సు దగ్ధం ఘటనపై పూర్తి దర్యాప్తు చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అధికా రులను ఆదేశించారు. గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు బస్సు ఇంజన్‌లో సంభవించిన మంటలతో ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. బస్సు మొత్తం కాలిపోయినట్లు తెలిపారు.

ప్రయాణికులకు భద్రతేదీ?

- కాలం చెల్లిన బస్సులను తిప్పుతున్న ఒడిశా ఆర్టీసీ
- జిల్లా మీదుగా రాకపోకలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికుల ఆందోళన
- జిల్లా రవాణా శాఖ అధికారులు దృష్టి పెట్టాలని విన్నపం

పార్వతీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఒడిశా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. ఆ రాష్ట్ర ఆర్టీసీ కాలం చెల్లిన బస్సులను ఎక్కువగా నడుపుతుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఈ సర్వీసులు అధికంగా రాకపోకలు సాగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గురువారం ఉదయం విజయనగరం నుంచి వొమ్మరకోటకు వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు (మిగతా 6వ పేజీలో..)



పూర్తిగా కాలిపోయిన ఒడిశా ఆర్టీసీ బస్సు

చెరువులనూ వదలట్లే!

- యథేచ్ఛగా ఆక్రమణలు
- వరహాల గెడ్డ కూడా.. • సర్వేలకే పరిమితమైన అధికారులు
- చర్యలు చేపట్టడంలో వెనకడుగు



ఆక్రమణకు గురవుతున్న వరహాల గెడ్డ ప్రాంతం

పార్వతీపురం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులు ప్రభుత్వ భూములు, స్థలాలతో పాటు చెరువులనూ వదలడం లేదు. జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న చెరువులతో పాటు గెడ్డ సైతం ఆక్రమణకు గురవుతోంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. పార్వతీపురం మండలం బాగొడబ రెవెన్యూ పరిధిలోని చెరువు విస్తీర్ణం గతంలో 50 ఎకరాల పైబడి ఉండేది. ప్రస్తుతం ఆక్రమణలతో ఆ చెరువు విస్తీర్ణం సగం కూడా పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా కొత్తవలసలో సంగం నాయుడు చెరువు, కొత్త చెరువు తదితర చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. జిల్లా కేంద్రంలోని వరహాల గెడ్డ సైతం కబ్జాకు గురవుతోంది. గత కొన్నిదశాబ్దాలుగా ఈ గెడ్డ ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ ఇరిగేషన్ శాఖ చూసీచూడనట్టు వ్యవహరిస్తుంది. తాజాగా వరహాల గెడ్డ స్థలం చేతులు మారినట్లు తెలుస్తోంది. చెరువులు ఆక్రమణకు గురికాకుండా (మిగతా 6వ పేజీలో..)

వాడీవేడిగా..

- సవాళ్లు.. ప్రశ్నలతో సాగిన జడ్పీ సమావేశం
- వైద్య కళాశాల నిర్మాణంపై బహిరంగ చర్చకు సిద్ధమా? • మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సవాల్
- గిరిజన విద్యార్థులతో శవ రాజకీయాలొద్దు • మంత్రి సంధ్యారాణి కౌంటర్
- అందరికీ మైకులిచ్చిన జడ్పీ చైర్మన్ • అరుపులు, కేకలతో సమావేశం గందరగోళం



మీరు ఆగండి అంటూ చైర్మన్‌కు చెబుతున్న మంత్రి సంధ్యారాణి

- విజయనగరం వైద్య కళాశాల నిర్మాణం పూర్తి కావాలంటే ఇంకా రూ.500 కోట్లు కావాల్సి ఉందని, పీపీపీ విధానంలో పనులు పూర్తయితే మరిన్ని సీట్లు కూడా పెరుగుతాయని, దీనిపై అవగాహన లేకుండా వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని, దీనిపై నాతో ఎవరైనా బహిరంగ చర్చకు వస్తారా అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సవాల్ విసిరారు.
- జ్వరాల బారిన పడి కొంతమంది గిరిజన విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని, వేచి చూడకుండా వారి మరణాలను ఆసరాగా తీసుకుని వైసీపీ నాయకులు శవరాజకీయాలు చెయ్యటం తగదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఘాటుగా స్పందించారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

విజయనగరం/టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):

మంత్రుల సవాళ్లు, సభ్యుల ప్రశ్నలు, అరుపులు, కేకలతో ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశం గురువారం వాడీవేడిగా సాగింది. ప్రారంభం నుంచి చివరి వరకూ ఒకే పంథాలో నడిచింది. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన మొదలైన సమావేశంలో మొంథా తుఫాన్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం అంశాన్ని పలువురు సభ్యులు లేవనెత్తారు. అధికారులు సమాధానం చెప్పేలోపే గజపతినగరం జడ్పీటీసీ, బాడంగి ఎంపీపీ లేచి రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని, యూరియా కూడా సరిగా ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. దీనిపై మంత్రి కొండపల్లి స్పందిస్తూ వరి పంటకు మాత్రమే కాకుండా ఇతర పంటలకు కూడా యూరియా వినియోగించారని, అయినప్పటికీ రైతులకు సరిపడా యూరియాను ఈప్రభుత్వం అందజేసిందని చెప్పారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడం వల్ల పేద వైద్య విద్యార్థులకు సీట్లు దొరకవని, వైద్యం పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతుందని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు విమర్శించారు. దీనికి మంత్రి శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. వైద్య కళాశాల నిర్మాణం, పీపీపీ విధానం గురించి అవగాహన లేక ఇలా మాట్లాడుతున్నారని, దీనిపై తనతో ఎవరైనా బహిరంగ చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తవ్వా లంటే ఇంకా రూ.6000 కోట్లు అవసరం ఉందనే విషయం మీకు తెలుసా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళశాలలో అన్ని వసతులు కల్పించాలంటే ఇంకా రూ.500 కోట్లు అవసరమని అన్నారు. దీనికి చైర్మన్ చిన్నశ్రీనుతో సహా అందరూ మౌనంగా ఉండిపోయారు. పీపీపీ విధానం వల్ల మెడికల్ కళాశాలల్లో పేదలకు సీట్లు పెరుగుతాయని మంత్రి వివరించారు. ఇదే విషయమై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో మెడికల్ కళాశాలకు స్థలసేకరణే చేయకుండా అక్కడి వైసీపీ నేతలు స్టేట్మెంట్లు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పేద విద్యార్థులు మెడిసిన్ చదవడం వైసీపీ నేతలకు ఇష్టం లేన ట్లు ఉందని, అందుకే పీపీ విధానంపై రాద్ధాంతం చేస్తు న్నారని చమత్కరించారు. కొత్త పించన్లు ఎప్పుడిస్తారని వైసీపీ సభ్యులు ప్రశ్నించగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బదులిస్తూ దరఖాస్తులు తీసుకుంటామని త్వరలో (మిగతా 6వ పేజీలో..)

వైద్య పరికరాలన్నీ ఉన్నాయా?

- సిబ్బంది పనితీరు ఎలా ఉంది?
- ఆరా తీసిన సీఆర్ఎం టీం
- జిల్లా ఆసుపత్రి సందర్శన



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న సీఆర్ఎం టీం

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) టీం గురువారం సందర్శించింది. ఈ బృందం సభ్యులు డాక్టర్ దీపికా శర్మ, డాక్టర్ రమణ, డాక్టర్ నీరజ్‌కుమార్ జిల్లా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సిబ్బంది పనితీరు, అవసరమైన వైద్య పరికరాలన్నీ ఉన్నాయా? లేదా? అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, సరిపడ వైద్యులను నియమిస్తే ఇంకా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివ నాగ జ్యోతి తెలిపారు. ఎంఆర్‌ఐ స్కాన్ సదుపాయం, కార్డియాలజీ విభాగం, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ, ట్రామా కేర్ మంజూరు చేయాలని డీసీహెచ్ జి.నాగభూషణరావు కోరారు. ఈ సదుపాయాలు ఇక్కడ లేకపోవడంతో రోగులను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సి వస్తోందని వివరించారు. 150 కిలోమీటర్ల దూరం ఉన్న విశాఖకు వెళ్లే సమయంలో రోగుల ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. అలాగే అన్ని సౌకర్యాలతో ఐసీయూ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, జిల్లా వైద్యాధికారులు రఘు, టి.జగన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొండను తొలిచి.. కంకర తరలింపు

- రక్షిత పైప్‌లైన్ ధ్వంసం
- పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రివేళల్లో లారీల్లో రవాణా
- ఇదీ ఉంగరాడ కొండపై పరిస్థితి

4లో

నందన్నా.. చల్లగా చూడు

- ఘనంగా అనుపోత్సవం
- హాజరైన మంత్రి సంధ్యారాణి

6లో

పంట భూముల్లో స్తంభాల ఏర్పాటు

- అడ్డుకున్న దత్తి గ్రామ రైతులు

4లో

ఆధునిక సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



పార్వతీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ యంత్ర పనిముట్లను అందిపుచ్చుకొని సాగు చేసే దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా ప్రగతి సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి రైతూ ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని, అందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయడంతో పాటు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఆరు వేల ఎకరాల లక్ష్యంగా ఉన్న చిరుధాన్యాల సాగు మరింత పెరగాలని, లాభసాటి పంటలను వేసుకొనేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 8 డ్రోన్లు ఉన్నాయని, వాటి సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలన్నారు. మొంథా తుపాన్‌తో నష్టపోయిన పంటల వివరాలను త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. జిల్లాలో 2.73లక్షల స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టాలని డీఎస్‌వోను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ దూరం



- సకాలంలో చికిత్స అందితేనే నివారణ
- అందుబాటులో చికిత్స, వైద్య పరీక్షలు
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

4లో

గిజబకు చేరిన గజరాజులు

4లో



ఓటర్ల ప్రక్షాళన జాబితాపై దృష్టి సారించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్

పార్వతీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల ప్రక్షాళన జాబితా రూపకల్పనపై జిల్లాల ఎన్నికల అధికారులు దృష్టిసారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ అన్నారు. ఓటర్ల ప్రక్షాళన జాబితా తయారీపై జిల్లా కలెక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా రూపకల్పనకు బీఎల్‌వోలు సర్వే చేయాలన్నారు. 2002 సంవత్సరం నాటి ఓటర్లు, 2025 ఓటర్ల జాబితాతో పోల్చి విచారణ చేపట్టాలన్నారు. 2002 ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదన్నారు. 1987 నుంచి 2004 వరకు ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను తండ్రి పేరుతో అనుసంధానించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.




జిల్లా కేంద్రం నుంచి పాల్గొన్న డీఆర్వో హేమలత

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

- సకాలంలో చికిత్స అందితేనే నివారణ
- అందుబాటులో వైద్య పరీక్షలు
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి)

మారుతున్న ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం, వంశపారంపర్య కారణాల వల్ల క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే రేడియేషన్, కిమోథెరపీ ద్వారా చాలావరకు నివారించ వచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడంతో ముదిరిపోయే వరకు రోగులు ఆసుపత్రులకు వెళ్లడంలేదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్‌తో బాధపడే వారు ఎక్కువగా వస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా పాంక్రియాటిక్, ఊపిరితిత్తులు, కడుపు, ప్రొస్టేట్ క్యాన్సర్ల వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్నారంటున్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా కథనం..



పాంక్రియాటిక్ క్యాన్సర్..

క్లోమగ్రంథి జీర్ణక్రియకు అవసరమైన ఎంజైములు, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ భాగంలో కణాలు అదుపుతప్పి పెరిగితే, పాంక్రియాటిక్ క్యాన్సర్‌గా మారుతుంది. ఇది అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్‌లో ఒకటి. ఎందుకంటే సాధారణంగా దీని లక్షణాలు చివరి దశలోనే బయటపడతాయి.

● లక్షణాలు ఇవే..

కడుపు లేదా వెన్నుపూస వద్ద నిరంతర నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం.. చర్మం, కళ్లలో పసుపు రంగు ఏర్పడడం (జాండీస్), వాంతులు, మలబద్ధకం, చక్కెర స్థాయిలు ఆకస్మాత్తుగా పెరగడం

● కారణాలు ఇవే..

ధూమపానం, మద్యపానం, అధిక కొవ్వు కలిగిన ఆహారం తీసుకోవడం, అధిక బరువు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉండడం

● వైద్యుల సలహా తప్పనిసరి..

పాంక్రియాటిక్ క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం కష్టమే కానీ ఎలాంటి లక్షణాలు కన్పించినా వైద్య నిపుణులను సంప్రదించాలి. ఎండోస్కోపీ, రక్త పరీక్షల ద్వారా ప్రారంభదశలో చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ముదిరి ప్రాణాపాయం జరగకుండా నివారించవచ్చును.



కడుపు క్యాన్సర్..

కడుపు క్యాన్సర్ సంబంధించిన కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. దీన్ని సైలెంట్ కిల్లర్ అంటారు. ఎందుకంటే చివరిదశ చేరేవరకూ ఈ లక్షణాలు బయటపడవు. అయితే సరైన సమయంలో గుర్తిస్తే చికిత్స సులభమౌతోంది.

● లక్షణాలు ఇవే..

ఆకలి కోల్పోవడం, అజీర్ణం, గ్యాస్, గుండెల్లో మంట, వికారం, వాంతులు, అప్పుడప్పుడు రక్తంతో కూడిన వాంతులు కావడం, పొత్తి కడుపు ప్రాంతంలో నొప్పి, రక్తహీనత, కొంచెం తిన్నా కడుపు నిండినట్టు అన్పించడం, నలుపురంగులో మలం రావడం వంటి లక్షణాలు కన్పిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి.

● జాగ్రత్తలు తప్పనిసరి..

ధూమపానం, మద్యపానం ఆపివేయాలి. నూనెపదార్థాలు తగ్గించాలి. జీర్ణకోశ సమస్యలు దీర్ఘకాలికంగా వేధిస్తే వెంటనే ఎండోస్కోపీ చేయించుకోవాలి. మొదటి లేదా రెండు దశల్లోనే కడుపు క్యాన్సర్‌ని గుర్తిస్తే ఆధునిక చికిత్స విధానం ద్వారా పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంది.

ఊపిరితిత్తుల క్యాన్సర్..



ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ధూమపానం వల్ల ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. పొగ తాగేవారి పక్కన ఉండడం వల్ల కూడా ఈ రకం క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగే వాయుకాలుష్యం కూడా వస్తుంది. కెమికల్ ఫ్యాక్టరీల్లో చేసే కార్మికులు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

● లక్షణాలు ఇవే..

మూడు వారాలు కంటే ఎక్కువగా వుండే దగ్గు ఉండడం. దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం, చిన్న పనిచేసినా శ్వాస ఆడకపోవడం, శ్వాస తీసుకున్నప్పుడు ఛాతీలో నొప్పి ఉండడం, అకారణంగా బరువు తగ్గడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. ఈ లక్షణాలు ఏర్పడితే తక్షణమే పల్మనాలజిస్ట్‌లను సంప్రదించి చికిత్స చేసుకోవాలి.

ప్రొస్టేట్ క్యాన్సర్..

దీన్ని పౌరుష గ్రంథి అంటారు. ఇది పురుషుల్లో మూత్రాశయం కింద అక్రోట్ (వాల్‌నట్) ఆకారంలో ఉండే ప్రొస్టేట్ గ్రంధిలో క్యాన్సర్ కణాలు పెరుగుతాయి. ఇది పురుషుల్లో అత్యంత సాధారణంగా వచ్చే క్యాన్సర్. ఇది 50 ఏళ్లు దాటిన పురుషుల్లో ఎక్కువగా ఉంటుంది. కుటుంబంలో ఎవరికైనా ప్రొస్టేట్‌క్యాన్సర్ ఉంటే తక్కువ వయస్సులోనే 40 ఏళ్లలోపు మగవారిలో వచ్చే ప్రమాదం ఉంది.

● లక్షణాలు ఇవే..

రాత్రి పూట తరచుగా మూత్ర విసర్జన చేయడం, మూత్రధార సన్నగా రావడం, మూత్రం ఆపడంలో కష్టపడడం వంటి లక్షణాలు ఉంటాయి.

● జాగ్రత్తలు ఇవే..

50 ఏళ్లు దాటిన పురుషులు వైద్యుడ్ని సంప్రదించి ప్రొస్టేట్-స్పెసిఫిక్ యాంటిజన్ రక్త పరీక్ష, అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కన్పించినా వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స చేసుకోవాలి. సరైన సమయంలో చికిత్స చేసుకోవడం ద్వారా ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నిరోధించవచ్చును.

అశ్రద్ధ వద్దు..



క్లోమో క్యాన్సర్ ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు చూపదు. అయితే రెండింటిని నిర్లక్ష్యం చేస్తే, క్యాన్సర్ ముదిరి ప్రమాదకరంగా మారుతుంది. దీర్ఘకాలిక అజీర్ణం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలను అసలు నిర్లక్ష్యం చేయకూడదు. ప్రాంకియాటిక్, కడుపు క్యాన్సర్లను ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. శస్త్ర చికిత్స, ఔషధాల ద్వారా ఈ వ్యాధిని నిరోధించవచ్చు. ఈ రెండు క్యాన్సర్ల విషయంలో ఎండోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రా సౌండ్ వంటి అత్యాధునిక స్క్రీనింగ్ పద్ధతుల ద్వారా క్యాన్సర్ ప్రభావాన్ని తెలుసుకోవచ్చు.

-డాక్టరు ఐ.నరేష్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, విజయనగరం

అవగాహనతోనే నివారణ..



ప్రొస్టేట్ క్యాన్సర్ రాకుండా నియంత్రించడం కష్టం. కానీ దానిని ముందుగానే కనిపెట్టడం మన చేతుల్లోనే ఉంది. వీలైనంత వరకు ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్ సోకే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉంటే.. 45 ఏళ్ల వయస్సు నుంచి, ఇతరులు 50 ఏళ్ల నుంచి, ప్రొస్టేట్ స్క్రీనింగ్ చేయించుకోవాలి. పరీక్షలో క్యాన్సర్ సోకినట్టు అనుమానం ఉంటే ఎంఆర్ఐ, ప్రొస్టేట్ బయాప్సీలతో నిర్ధారించవచ్చు. నేడు అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి లక్షణాలు ఉన్నా అశ్రద్ధ చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి.

-డాక్టరు జె.శ్రీకాంత్, యురాలజిస్ట్, విజయనగరం

ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట..



పాంక్రియాటిక్, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్ క్యాన్సర్‌లో చికిత్స ఫలితాలకు ముందస్తు గుర్తింపు అత్యంత కీలకం. ఈ మూడు రకాల క్యాన్సర్లు భిన్నమైనవి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రధానంగా ధూమపానంతో ముడిపడి ఉంటుంది. ప్రాంకియాటిక్ క్యాన్సర్ పైకి లక్షణాలు కన్పించకపోవడంతో రోగ నిర్ధారణ సమయానికి ముదిరిపోయే ప్రమాదం ఎక్కువ. అయితే ప్రొస్టేట్ క్యాన్సర్ నెమ్మదిగా పెరుగుతూ, ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమౌతుంది. ఎటువంటి లక్షణాలు కన్పించినా సొంత వైద్యం మానుకుని వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. నేడు అధునాతన సాంకేతిక వైద్యంతో క్యాన్సర్‌ను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

-డాక్టరు పి.వంశీధర్, అంకాలజిస్ట్, విజయనగరం

ధూమపానం మానివేయాలి..



ఊపిరితిత్తులు క్యాన్సర్ అనేది ప్రధానంగా జీవనశైలి మార్పులు వల్లే వస్తుంది. ప్రధానంగా ధూమపానం వినియోగం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పది రెట్లు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ధూమపానం మానేయడం అత్యవసరం. ధూమపానం ఎక్కువ చేసేవారు ప్రతి ఏటా తక్కువ డోస్ సిటీస్కాన్ చేయించుకోవడం అత్యవసరం. ఈ స్క్రీన్ ద్వారా ప్రారంభదశలో క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స చేయవచ్చు. ముందస్తు పరీక్షలు, అధునాతన చికిత్స ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ సమర్థవంతంగా ఎదుర్కోవచ్చును.

-డాక్టరు బి.సంతోష్‌కుమార్, పల్మనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి

కొండను తొలిచి.. కంకర తరలించి

- రక్షిత పైప్‌లైన్ ధ్వంసం
- పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రివేళల్లో లారీల్లో రవాణా
- ఇదీ ఉంగరాడ కొండపై పరిస్థితి



కంకర తవ్వకాలతో ధ్వంసమైన రక్షిత పైప్‌లైన్

రేగిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్లపాడు రెవెన్యూ సరిహద్దులో గల సర్వేనెంబర్-1లో ఉన్న ఉంగరాడకొండను తొలిచి యథేచ్ఛగా కంకరను తవ్వి తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి వేళల్లో లారీల్లో రవాణాచేస్తున్నారు. పలు ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని లారీలు, టిప్పర్లతో కొందరు స్థానికులు కంకరను తరలిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు అత్యంత సమీపంలో నుంచే తరలిసున్నా పర్యవేక్షించడంలేదని ఆరోపణలొస్తున్నాయి. కంకర తవ్వకాలవల్ల ఉంగరాడమెట్ట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వెళ్లే రక్షిత పైప్‌లైన్ ధ్వంసమయ్యిందని పలువురు చెబుతున్నారు. దీంతో నీరు వృథాగా పోతోంది. ఇక్కడ కంకర తవ్వకాల వల్ల పైపులైన్ దెబ్బతిన్న విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎటువంటి సమాచారం లేదు. పైపులైన్ దెబ్బతినడంతో మండలంలోని పలు గ్రామాలకు నీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కాగా ఇక్కడ కంకర క్వారీలపై సమాచారం ఉందని, ఇటీవల ఆర్ఐ గిరి తాను తనిఖీ చేసినట్లు వీఆర్వో రామకృష్ణ తెలిపారు. పగలు తవ్వ కాలు చేయడం లేదని, రాత్రివేళల్లో తీసిఉండొచ్చుని అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై నిఘాపెడతామని, పైప్‌లైన్ ధ్వంసంకావడంపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



గిజబ సమీపంలో పంట పొలాల్లో గజరాజుల గుంపు

గిజబకు చేరిన గజరాజులు

గరుగుబిల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు రోజులుగా సంచరించిన గజరాజుల గుంపు గురువారం గిజబకు చేరుకుంది. కొద్ది రోజులుగా సంతోషపురం, పిట్టలమెట్ట, నాగూరు, ఖడ్గవలస, తోటపల్లి గ్రామాల్లో సంచరించిన ఏనుగుల గుంపు వరి పంటలను ధ్వంసం చేయడంతో పాటు జనావాసాల్లో చొరబడే యత్నం చేసింది. ఈక్రమంలో ఓ ఇంటి గేటును ఏనుగులు ధ్వంసం చేశాయి. ఖడ్గవలసలో సంచరించిన గజరాజులను అటవీ అధికారులు, ట్రాకర్లు రహదారి మార్గం మీదుగా గిజబ ప్రాంతం వైపు వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టారు. దాంతో గిజబలో అరటి పంటలతో పాటు వరి పంటలకు నష్టం కలిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. వరి పంట కోతలు సమయంలో గజరాజుల గుంపు సంచరించడంతో వ్యవసాయ పనులు నిర్వహించలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి గజరాజుల గుంపును సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.



అసత్యం నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న అసత్యం నాటిక

విజయనగరం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గురజాడ కళాభారతిలో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర ఆహ్వాన నాటక పోటీల్లో గురువారం ప్రదర్శించిన అసత్యం నాటిక ఆకట్టుకుంది. చైతన్య కళాస్రవంతి విశాఖ పట్నం బృందంతో నిర్వహించిన ఈనాటి ఆద్యంతం నటులంతా రక్తి కట్టించారు. శనివారం వరకూ నిర్వహించనున్న ఈనాటిక పోటీల్లో అమ్మచెక్కిన బొమ్మ, స్వప్నం రాల్చిన అమృతం, కిడ్నాప్,సూత్రం వంటి పలు సాంఘిక నాటికలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



భాను ప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యారాణి

సైన్స్ ఎక్స్‌పోకు ఆదర్శ పాఠశాల విద్యార్థి

డెంకాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అక్కివరంలోని ఆదర్శపాఠశాలలో పదో తరగతి చదువుతున్న పతివాడ భాను ప్రసాద్ శుక్ర, శనివారం ఢిల్లీలో జరగనున్న సైన్స్ ఎక్స్‌పో పురస్కరించుకుని నాసా, ఇస్రో శాస్త్రవేత్తలతో మాట్లాడడంతో పాటు ఇండో రష్యన్ సైన్స్ కేంద్రాన్ని సందర్శించే అవకాశం లభించింది. బెంగళూరులో జరిగిన జాతీయ సైన్స్ సెమినార్-25లో భాను ప్రసాద్ 17వ స్థానంలో నిలవడంతో అవార్డు, ప్రశంసాపత్రంతోపాటుగా సైన్స్ కట్ బహుమతిగా అందుకున్నట్లు ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య తెలిపారు. దీంతో సైన్స్ ఎక్స్‌పోకు ఎంపికయ్యాడు. భానుప్రసాద్‌కు ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్, డీఈవో అభినందించారు.

మొండి బకాయిల వసూలుకు చర్యలు

- డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున



కస్టమర్లకు డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న నాగార్జున

చీపురుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొండి బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకుంటామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. బ్యాంకుకు ప్రస్తుతం 60 నుంచి 70 లక్షల మొండి బకాయిలు ఉన్నాయని చెప్పారు. గురువారం చీపురుపల్లి బ్రాంచ్‌లో డిపాజిటర్లలకు పత్రాలను అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాలుగు నెలల్లో సుమారు 25 కోట్లు డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. రుణ గరిష్ఠ పరిమితి 20 లక్షలే అయినప్పటికీ, చాలా మంది రాజకీయ నాయకులు తమ కుటుంబ సభ్యుల పేర్లతో పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నారని చెప్పారు. సకాలంలో బ్యాంకుకు తిరిగి చెల్లించకపోవడం వల్ల మొండి బకాయిలు పెరిగిపోయాయని తెలిపారు. వారికి మూడు నోటీసులు ఇచ్చామని, వసూలు కాని పక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ కల్పన, సిబ్బంది మహంతి వేణు, రామలింగపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఇప్పిలి సురేష్, సీఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- కోటి గోనె సంచులు అవసరం
- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఈనెల పదో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని జేసీ సేతుమాధవన్ ప్రకటించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రైసు మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సంతకవిటి, వంగర, తెర్లాం మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయని, మరికొన్ని చోట్ల ఆలశ్యమయ్యే అవకాశం ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల భారీగా వర్షాలకు కురవడంతో ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండే అవకాశముందని తెలిపారు.ఈ ఏడాది బీజీలు వెంటనే సమర్పించాలని కోరారు. కోటి గోనె సంచులు అవసరమని, మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలు మేరకు గోనెసంచులను సిద్ధం చేయాలని చెప్పారు. సుమారు 4,600 వాహనాలను గుర్తించామని, వాటికి జీపీఎస్ పరికరాలను అమరుస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు మిల్లర్లు తమవంతుగా సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలోని డీఎస్‌వో మురళిధర్, ఏఎంవోలు పాల్గొన్నారు.

రాజాం కమిషనర్‌గా రామచంద్రరావు

రాజాం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపల్ కమిషనర్‌గా ఎ. రామచంద్రరావును నియమిస్తూ మునిసిపల్ పరిపాలనాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రేపల్లె మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను పదోన్నతిపై రాజాం మునిసిపల్ కమిషనర్‌గా నియమించింది. ఇక్కడ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన రామ అప్పలనాయుడు గతనెలలో తణుకు మునిసిపాలిటీకి బదిలీ కావడంతో మేనేజర్ కొంచాడ శ్రీనివాసరావు ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నెల్లిమర్ల కమిషనర్‌గా జనార్దనరావు..

నెల్లిమర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా జీవీఎంసీలో పనిచేస్తున్న ఎస్.జనార్దనరావు నియమితులయ్యారు. ఆయన్ను కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న జైరాం ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు.



కల్కి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పలరాజు

పంట భూముల్లో స్తంభాల ఏర్పాటు

- సిమెంట్ కర్మాగారం కోసం లైన్లు వేసే పనుల ప్రారంభం
- అడ్డుకున్న దత్తి గ్రామ రైతులు

కొత్తవలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలియకుండా తమ భూముల నుంచి విద్యుత్ స్తంభాలు, లైన్లు వేయడంతో అప్పన్నపాలెం పంచాయతీ దత్తి గ్రామానికి చెందిన రైతులు గురువారం అడ్డుకున్నారు. కొత్తసుంకరపాలెం సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ సిమెంట్ కర్మాగారానికి సంబంధించి విద్యుత్ సరఫరా కోసం బుధవారం రాత్రి రైతుల భూముల్లో నుంచి విద్యుత్ హైటెన్షన్‌కు సంబంధించి స్తంభాలు, లైన్లు వేయడం మొదలు ప్రారంభించారు. ఈవిషయం తెలుసుకున్న రైతులు గురువారం పనులు అడ్డుకున్నారు. తమ భూముల్లో నుంచి విద్యుత్ లైన్లు వేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారని నిలదీశారు. ఈ విషయం స్థానిక తహసీల్దార్ పి. అప్పలరాజు దృష్టికి రైతులు తీసుకెళ్లారు. అల్ట్రాటెక్ సిమెంట్‌కర్మాగార యాజమాన్యం తమ భూముల్లో నుంచి విద్యుత్ లైన్లు వేయడాన్ని తాము ఎంతమాత్రం అంగీకరించేదిలేదని రైతులు తేల్చిచెప్పారు. తమకు సంబంధంలేదని, ఈ విషయం విద్యుత్ శాఖ చూసుకుంటోందని అల్ట్రాటెక్ యాజమాన్యం పేర్కొంది. విద్యుత్ అధికారులను ప్రశ్నించగా ఈ వ్యవహారాన్ని కల్కి ఇంజనీరింగ్ సంస్థ చూస్తోందని చెప్పడంతో తహసీల్దార్ అప్పలరాజు కల్కి ఇంజనీరింగ్ అధికారులు ఎవరు అనుమతులతో విద్యుత్ లైన్లు వేస్తున్నారో ఆధారాలతో చూపించాలని కోరారు. రైతుల భూముల్లో నుంచి విద్యుత్ లైన్లు వేసే సమయంలో వారితో ముందుగా సమావేశం ఏర్పాటుచేయాలని, అందుకు సంబంధించి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సంఘటనా స్థలానికి తహసీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ షణ్ముఖ వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం బొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడిజిల్లా జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శని వారం నుంచి శ్రీకాకుళంలో జరగ నున్న రాష్ట్రస్థాయి పోటీ ల్లో పాల్గొనున్నట్టు తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థు లకు విద్య, ఉద్యోగాల్లో మూడుశాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు చెప్పారు. 200 కిలోమీటర్లు దాటి పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు రోజూ దాటితే అలవెన్స్ కూడా ఇచ్చే సౌలభ్యం కల్పించినట్లు తెలిపారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీఈవో యు.మాణిక్యంనాయుడు, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వర రావు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో జి.గిరి బాల, స్కూల్ గేమ్స్ అధ్యక్షులు ఎల్‌వి.రమణ, గోపాలరావు, స్కూల్ హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఎంఈవో-2 ఎ. వెంకటరమణ, అచ్చింనాయుడు, రాజేష్ పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

గెడ్డలో పడి వృద్ధురాలు మృతి

రాజాం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సారధి గ్రామ పరిసరాల్లో గల సారధిగెడ్డలో అదే గ్రామానికి చెందిన యండమూరి గౌరమ్మ(60)ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందింది. దుస్తులు ఉతికేందుకు గెడ్డకు వెళ్లిన ఆమెకు బీపీ అధికం కావడంతో తూలిపడి మరణించి ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ తెలిపారు.

క్వారీ నీటిగుంతలో పడి గొర్రెల కాపరి..

ఎస్.కోట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట పంచాయతీ పరిధిలోగల మల్లిపూడి గ్రామానికి చెందిన కిలో రాజు(31) గ్రామ సమీపంలోగల క్వారీ నీటిగుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..రాజు ఓ ఒక వ్యక్తి వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి గొర్రెలు కాస్తున్న సమయంలో మందలోఉన్న ఒక గొర్రె నీటికుంద వద్దకు వెళ్లింది. ఆ సమయంలో దానిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండగా కాలుజారీ గుంతలో పడిపోయాడు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి కేకలు వేస్తు గ్రామానికి చేరుకొని జరిగిన విషయం తెలియజేశారు.దీంతో గ్రామానికి చెందిన యువకులు గుంతలో దిగి గాలించిన కనిపించలేదు. గురువారం ఉదయం మరోసారి వెతికగా మృతదేహం లభించింది. రాజుకు ఇంకా వివాహం కాలేదు. తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి గాయాలు

డెంకాడ, నవంబరు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని మోదవలస సమీపంలోగల బుల్స్ ఫ్రెండ్లీ రెస్టారెంట్‌లో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో క్షత్రియ వికాస్‌సింగ్‌కు తలపై బలమైన గాయాలయ్యాయని డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. స్నేహితుడు ఎస్.రాంబాబు పుట్టినరోజు పురస్కరించుకుని బుధవారంరాత్రి పార్టీకి ఆహ్వానించారు.దీంతో విజయనగరం నుంచి క్షత్రియ వికాస్‌సింగ్, లోహిత్, ధనుష్, వీరు మాధవస సమీపంలో గల బుల్స్ ఫ్రెండ్లీ రెస్టారెంట్‌కు పార్టీ నిమిత్తం వెళ్లారు. అక్కడ రాత్రి సుమారు 10 గంటల సమయంలో రెస్టారెంట్ పక్కన ఉన్న పాన్, టీషాప్ యజమాని సత్యనారాయణ, ఆయన స్నేహితుడు జానా వీరిపై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘర్షణలో వికాస్‌సింగ్‌కు తలపై బలమైన తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈమేరకు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

52 మంది బైండోవర్

రేగిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలో వివిధ గ్రామాల్లో అనధికారికంగా మద్యం అమ్ముతున్న 52 మంది బెల్ట్ దుకాణాల నిర్వాహకులపై గురువారం రాజాం ఎక్సైజ్‌శాఖ కొరడా ఝుళిపించింది. ఇకపై బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమమద్యం పోత్సహించినా చర్యలుతప్పవని హెచ్చరించింది. ఈమేరకు గురువారం వారిని రాజాం ఎక్సైజ్ ఎస్ఐ మహేష్ తహసీల్దార్ కృష్ణలత ఎదుట బైండోవర్ చేశారు. బెల్ట్‌షాపులు, కల్తీమద్యం, సారా, డ్రగ్స్‌పై ప్రభుత్వం సీరియస్ దృష్ట్యా ఉన్నతాధికార్ల ఆదేశాలప్రాప్తికి ముందస్తు చర్యలో భాగంగా బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

ఎస్.కోట రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసినట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి సేవించినా, రవాణాచేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజాంలో రేషన్ బియ్యం సీజ్

రాజాంరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలెపువీధిలో ఓ వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు గురువారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.ఈ మేరకు వ్యాపారి అప్పలరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు. రాజాం సీఎస్‌డీటీ అనంతకుమార్ కథనం మేరకు..


సీజ్ చేసిన బియ్యాన్ని తూకం వేస్తున్న అధికారులు

పట్టణంలోని కాలెపువీధికి చెందిన అప్పలరాజు కొన్నాళ్లుగా రేషన్ బియ్యాన్ని కొనుగోలుచేసి వాటిని అధిక ధరకు మిల్లర్లకు విక్రయిస్తున్నాడు. అప్పలరాజు ఇంట్లో అధికమొత్తంలో బియ్యం ఉన్నాయన్న సమాచారం ప్రకారం గురువారం విజిలెన్స్ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో దాడిచేసి 8 క్వింటాళ్ల 49 కిలోల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. రేషన్ దాడుల్లో వీఆర్వో అబ్బాస్,కాంతరావు పాల్గొన్నారు.

శంకరరావుకు నేషనల్ గ్లోరి అవార్డు

గజపతినగరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి):మెంటాడ మండలంలోని జీటీపేట ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకరరావుకు ప్రముఖ వ్యక్తులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక నేషనల్ గ్లోరీ అవార్డు లభించింది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ సంస్థ ద్వారా సాహిత్యం, కళా, విద్యా, సామాజిక సేవారంగాల్లో 25 ఏళ్లుగా చేస్తున్న కృషికిగుర్తింపుగా అవార్డు అందజేస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్.అన్నపూర్ణ వర్తమానం పంపినట్లు గురువారం ఒక ప్రకటనలో శంకరరావు తెలిపారు. గ్లోరి అవార్డుకు ఎంపికకావడంతో డీఈవో మాణిక్యంనాయుడు, డిప్యూటీ డీఈవో మోహనరావు,బీవీ రమణ, హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు అభినందించారు.

బౌద్ధ మహోత్సవానికి తరలిరావాలి

రాజాం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లాలోనికోరుకొండ మండలం కాపవరంలో శనివారం జరగనున్న బౌద్ధ మహోత్సవానికి రాజాం నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని బీఎస్పీనాయకుడు పేకేటిరామారావు పిలుపునిచ్చారు. గురువారం రాజాంలో బౌద్ధమహోత్సవానికి సంబం ధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తవిటయ్య, రౌతు గణపతిరావు నాయుడు, తేగల మోహన్, శీర అనిల్ కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు నిర్వహిసే చర్యలు: సీఐ


రోడ్డుపై ఆక్రమణలు తొలగిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

విజయనగరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపై తోపుడు బళ్లు, చిరు వ్యాపారులు ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు హెచ్చరించారు. గురువారం విజయనగరంలోని సిటీస్టాండ్ రోడ్డులో ఆక్రమించి ఏర్పాటుచేసిన తోపుడుబళ్లను ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంటస్తంభం, మార్కెట్, కన్యకాపరమేశ్వరీ ఆలయం రోడ్డు, సిటీస్టాండ్, మెయిన్‌రోడ్డు, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిత్యం తోపుడు బళ్ల వ్యాపారస్థులు రోడ్డు మధ్యలో పెడుతూ, ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.ఇకపై రోడ్డుపై తోపుడుబళ్లు పెట్టి వ్యాపారం నిర్వహిస్తే, కేసులు నమోదు చేసి తోపుడుబళ్లను స్టేషన్‌కి తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండరాజుపేట, బంగార్రాజుపేట, మోపాడ ఏజీఎల్ లైన్స్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. చెట్లకొమ్మల తొలగింపుతో పాటు సాంకేతిక పనులు నిర్వహించనున్న దృష్ట్యా అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రేపు రైతు సమ్మేళనం

నెల్లిమర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శనివారం రైతు సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్.రావు గురువారం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కె.అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అధితి గజపతి రాజు, లోకం నాగమాధవి, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

సంతకవిటి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వీఏఏలు, ఎఫ్‌టీవో, డేటా ఎంట్రీ ఆఫీసర్, రైస్ మిల్లుల కస్టోడియన్ ఆఫీసర్లకు జిల్లా సివిల్ సప్లై కార్యాలయం సిబ్బంది గురువారం శిక్షణ నిర్వహించారు. ఏవో యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో డీటీ మధు, సీఎస్‌డీటీ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతికాపల్లిలో మొంథాతుఫాన్ వల్ల పంటనష్టం జరిగితే అధికారులు పూర్తి స్థాయిలో నమోదు చేయకుండా కంటి తుడుపుగా పరిశీలించి వెళ్లిపోయారని, గ్రామంలో చాలా వరకు పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి రైతులకు తగిన న్యాయం చేయాలని సర్పంచ్ వాకముల్ల చిన్నారావు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ కొర్ని ఈశ్వరరావు మాట్లాడుతూ నందబలగ ప్రాథమిక పాఠశాలకు ప్రతి రోజూ మద్యం సేవించి వస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల సునీత ఎంపీడీవో ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ హక్కులు కల్పించాలి

కొత్తవలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యను జేసీ పరిష్కరించాలని చిన్నిపాలెం గ్రామ రెవెన్యూ భూముల సంరక్షణ రైతు సంక్షేమ సేవా సమితి డిమాండ్ చేసింది.ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో చిన్నిపాలెంలో రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నిపాలెంలో నిర్వహిస్తున్న రీ సర్వేలో భాగంగా ప్రతి రైతు పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో రైతుల సాగును పరిశీలించి నమోదు చేసి చట్టపరమైన భూమి హక్కులను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పలరాజు మాట్లాడుతూ రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తమడపు అప్పారావు,మొయ్యిదేముడుబాబు, బాదిరెడ్డి వెంకట రమణమూర్తి,చొక్కాకుల సన్యాసిరావు పాల్గొన్నారు.

పోషకాహారం అందజేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలలకు గుడ్లు, పాలు, పోషకాహారం సమయానికి అందజేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ వనిత తెలిపారు.గురువారం విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోగల ధర్మపురిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్నేహలత, దుర్గాదేవి, శారద, రమ పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి క్యాంటీన్ సరుకులు ఇవ్వాలి

విజయనగరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ ఉద్యోగులకు పోలీసు శాఖ ఉద్యోగులకు ఇస్తున్న క్యాంటీన్ సరుకులను ఇవ్వాలని అగ్నిమాపక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.రమేష్, సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం ఎస్పీ ఎఆర్ దామోదర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కృష్ణమోహన్, ప్రకాష్‌రావు, ఆదినారాయణ, ఎల్.ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


శృంగవరపుకోట: రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, నాయకులు నానిగిరి రమణాజీ, కొణదం మల్లేశ్వరరావు, పోట్నూరు సాయిరాం, రవి, ఇందుకూరి శ్రీనిరాజు, భీశెట్టి అరుణ, బోనంగి లక్ష్మి, కన్నతల్లి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా పంపిణీ

లక్కవరపుకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ఎస్.కోట మండలంలోని పోతనాపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గేదెల ముత్యాలమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వ బీమాపథకం కింద రూ.ఐదులక్షలను గురువారం ఎమ్మెల్యే లలితకుమారి ఎల్.కోటలో అందజేశారు.ముత్యాలమ్మ విశాఖ ద్వారకానగర్‌లో ప్రమాదంలో మృతిచెందింది. ఆమె వంద రూపాయలు చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంది. ఈ మేరకు కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల బీమా ఇస్తామని టీడీపీ అధినేత ప్రకటించిన నేపథ్యంలో మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, కూనిరెడ్డి రాము, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు పెద్దపీట

చీపురుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను పెద్ద పీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. గురువారం చీపురుపల్లిలో జి.అగ్రహారంలో సీసీ రోడ్డుకు, గురానపేటలో పాఠశాల అదనపు తరగతి భవనా పనులకు భూమి పూజ చేశారు. అనంతరం అనాక్యాంటీన్ పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, రావివలస, పుర్రేయవలస సర్పంచ్‌లు పనస మణికంత, సారిక మోహనరావు, ఆరతి సాహు పాల్గొన్నారు.


పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

ఉపాధి అవకాశాలు కల్పించాలి

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



మాట్లాడుతున్న మురళీమోహన్

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణకార్యక్రమాలు నిర్వహించి, ప్రతిభవంతులైన నిరుద్యోగులకు రుణాలు అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. గురువారం రాజాంలోని నైరాడ్ శిక్షణ కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో బ్యాంకర్లు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నైరాడ్‌లో ఉచిత కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి బ్యాంకుల్లో రుణాలు మంజూరు వారికి స్వయం ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు రమణమూర్తి , నాబార్డు ఏజీఎం పి.నాగార్జున, నైరెడ్ డైరెక్టర్ రాజేష్, ఏపీఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్‌కుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి వహీర్, పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మహస్రష్, సమతం శ్రీను, వల్లూరు గణేష్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగును ప్రోత్సహిస్తాం

ప్రకృతి వ్యవసాయం పండించిన రైతులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం రైతు జాతీయరైతునేస్తం అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు పండించిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన మైసూరుమల్లిక, దేశవాళీ బ్రౌన్ రైసును ఎమ్మెల్యేకు అందజేశారు.కార్యక్రమంలో గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల నాగరాజు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు

పంటకోత ప్రయోగాలను పూర్తి చేయాలి

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంట కోత ప్రయోగాలను సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం .రాజశేఖర్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటాఎంటీ ఆపరేటర్లు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రఘునాథ్, అనంత్ పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

గజపతినగరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం వ్యవశాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం అయ్యప్ప స్వామి మహా పడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులతోపాటు కుటుంబ సభ్యులు తాటిపాక కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, మెంటాడ మండలాల నుంచి అయ్యప్ప, శివ, భవానీ భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి విజయనగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు అతిది గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగ్రారాజు, కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో శ్రీకాకుళం జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ స్థాయి నేతలు,తరలివచ్చారు. మహా పడిపూజకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

మోపాడలో అంబలం పూజ

డెంకాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడలో బుధవారం రాత్రి ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు కుటుంబ సభ్యులు అయ్యప్పస్వామి అంబలం పూజ నిర్వహించారు. కార్యక్రమానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి దంపతులు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు హాజరయ్యారు.

సంకిలి సచివాలయం పరిశీలన

రేగిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలి గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీడీవో శ్యామలాకుమారి గురువారం పరిశీలించారు. శిథిలభవనంలో సేవలు అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సంకిలి సచివాలయసిబ్బంది అవస్థలపై కథనం ప్రచురితంకావడంతో ఎంపీడీవో స్పందించారు. ఈ మేరకు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావుతో కలిసి ఎంపీడీవో సంకిలి సచివాలయాన్ని సందర్శించారు. ఇక్కడ పాతభవనం, కొత్తభవనం పరిస్థితులను గమనించారు. కొత్తభవనంలో సచివాలయం మార్పుకు పీఆర్ డీఈఈ, ఏఈలతో మాట్లాడతానని, ఇంకా పెండింగ్ ఉన్న చిన్నచిన్న పనులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీవో తెలిపారు.


సంకిలి సచివాలయ కొత్త భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

సీఎంకు పోస్టుకార్డులు రాసిన నిర్వాసితులు

ఎస్.కోటరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర వద్ద 141 రోజులుగా జిందాల్‌పరిశ్రమ నుంచి తమ భూములు ఇప్పించాలని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు సీఎం చంద్రబాబునాయుడు న్యాయం చేయాలని పోస్టు కార్డులు రాశారు. రాష్ట్రంలో ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించే ముఖ్యమంత్రి తమను పట్టించుకోకపోవడం బాధకలిగిస్తోందని నిర్వాసితులు వాపోయారు.

ఇసుక తీసుకువెళ్లడంపై విచారణ చేపట్టండి

జామి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జామి పంచాయతీ పాలకులు గోస్తనీ నదిలో పేదలు సేకరించిన ఇసుకను తీసుకువెళ్లడంపై విచారణ నిర్వహించాలని దళిత సంఘ జిల్లా నాయకుడు, ఆర్టీఐ చట్టం ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు కోరారు.ఈ మేరకు తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈవిషయంపై తాను కలెక్టర్, ఆర్డీవో, జేసీలకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు.

ఎఫ్‌ఏ సంఘ అధ్యక్షుడిగా సత్యనారాయణ

మెరకముడిదాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ మండలాధ్యక్షుడిగా గర్బాపు సత్యనారాయణ ఎన్నికయ్యారు. గురువారం మెరకముడిదాంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ (ఎఫ్‌ఏ) కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా పిన్నింటి రాంబాబు, కోశాధికారిగా కోట్ల లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా ఉత్తరావెల్లి గణపతి, బాలి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి ఆదినారాయణ, కొత్తింటి జగ్గారావు, పంట్ల భాస్కరరావు, బైరెడ్డి రమేష్, చల్లా శ్రీరాములు, లోమిశా శ్రీరామ్మూర్తిలను ఎన్నుకున్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

గరివిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని దేవాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న జమ్ము లాస్య బాలికల విభాగంలో అండర్-14 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎంబి.భానుమతి తెలిపారు. ఈనెల ఐదో తేదీన విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన జరిగిన పోటీల్లో లాస్య సత్తాచాటింది.ఈ మేరకు లాస్యను హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు నడిపేన సూర్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

●గుర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):చింతలపేట జడ్పీ పాఠశాల విద్యార్థి రష్మి అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దుర్గాగౌరి తెలిపారు. శ్రీకాకుళంలో జరగనున్నపోటీల్లో పాల్గొననున్న రష్మిని హెచ్‌ఎం తోపాటు పీడీ ఎం.రామకృష్ణ అభినందించారు.

వెంకటరావుకు పరామర్శ

గరివిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గరివిడి మండలంలోని తోండ్రంగిలో జిల్లా రైస్‌మిల్లుల సంఘం అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ బలగం వెంకటరావు మాతృమూర్తి బలగం సూరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున గురువారం పరామర్శించారు. సూరమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బలగం వెంకటరావును, ఆయన వెంట స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ల్యాండ్‌పూలింగ్ విధానంలో భూ సమీకరణ

●వీఎంఆర్‌డీఏ అసిస్టెంట్ సర్వేయర్ ఖాజాబాబా


రైతులతో మాట్లాడుతున్న ఖాజాబాబా

భోగాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ల్యాండ్‌పూలింగ్ విధానంలో భూసమీకరణ చేయడానికి సన్నహాలు చేస్తున్నామని వీఎంఆర్‌డీఏ అసిస్టెంట్ సర్వేయర్ ఖాజాబాబా తెలిపారు.భూసేకరణపైగూడెపువలస గ్రామసమీపంలో గురువారం రైతులతో ఖాజాబాబా మాట్లాడారు. ఈసందర్భంగా మరోసారి భూములిచ్చి మోసపోబోమని గూడెపువలస, చాకివలస గ్రామాలకు చెందిన రైతులు తేల్చిచెప్పారు. ల్యాండ్ పూలింగ్ విధానానికి సంబంధించి రైతులతో మాట్లాడి నివేదిక విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎస్ హరేంద్రప్రసాద్‌కు అందజేయనున్నామని చెప్పారు. ఈ మేరకు రైతులు మాట్లాడుతూ గతంలో ఇటీవల ఎయిర్‌పోర్టుకు భూములిచ్చామని కొంత మందికి పరిహారం ఇప్పటికి అందలేదన్నారు. భూములిచ్చిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశాలు ఇస్తామనిచెప్పి ఎయిర్‌పోర్టులో ఉపాధి కల్పించలేదన్నారు. మరోసారి భూములిచ్చి మోసపోవడానికి సిద్ధంగాలేమన్నారు. అయినా గూడెపువలసలో రైతుల వద్ద కొద్దిపాటి భూములు మాత్రమే ఉన్నాయని, అవికూడా తీసుకొంటే ఏవిధంగా జీవించగలమన్నారు. అనంతరం ఖాజాబాబా మాట్లాడుతూ ఇక్కడ జరిగిన విషయాన్ని విశాఖ కలెక్టర్‌కు నివేదించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో వాక్‌దేవి, సర్పంచ్ అయ్యప్పరెడ్డి, రైతులు కె.రాంమూర్తి పాల్గొన్నారు.

సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలి

రాజాం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకాలం వేతనాలను చెల్లించాలని, అంగీకరించిన ఒప్పందాలను అమలుచేయాలని మునిసిపల్ కార్మికుల సంఘ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాం మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోధర్నా చేపట్టారు. అనంతరంపలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ శ్రీనివాసరావుకు అందజేశారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఒడిశా ఆర్టీసీ బస్సు దగ్ధం

(3వ పేజీ తరువాయి)

నిలిపి తనిఖీ చేశాడు. డాష్‌బోర్డు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో బస్సు నుంచి పొగలు రావడాన్ని గమనించాడు. దీంతో ఆయన మంటలు ఆర్పడానికి ఫైర్ ప్రొటెక్షన్‌తో ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. డ్రైవర్‌తో పాటు కండక్టర్ కూడా ప్రయాణికులను అప్రమత్తం చేసి వారిని వెనువెంటనే కిందకు దిగేలా చేశారు. ఇంతలో మంటలు బస్సు అంతా వ్యాపించాయి. సమాచారం అందుకున్న పాచిపెంట ఎస్ఐ వెంకటసురేష్ సిబ్బందితో సహా అక్కడకు హుటాహుటిన వెళ్లారు. ఉన్నతాధికారులు, సాలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఆ మార్గంలో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఘటనా స్థలానికి సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు, రూరల్ సీఐ పి.రామకృష్ణ చేరుకున్నారు. సాలూరు నుంచి అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఏం జరగక పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులను కాపాడిన డ్రైవర్ సుబీర్ హరిజన్‌ను పలువురు అభినందించారు.

డీజిల్ ట్యాంకర్ రాకతో ఆందోళన..

ఘాట్‌రోడ్డులో ఒడిశా ఆర్టీసీ బస్సు దగ్ధమవుతున్న సమయంలో విశాఖ నుంచి జయపురానికి వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఘటనా స్థలానికి సమీపంలోకి రావడంతో అక్కడున్న వారిలో ఆందోళన మొదలైంది. వెంటనే అప్రమత్తమై ఆయిల్ ట్యాంకర్‌ను దూరంగా వెనుకకు మళ్లించారు. పోలీసు లు ట్రాఫిక్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. బస్సు కాలిపోతుండడంతో అప్పటికే ఒడిశా, ఏపీల నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఆందోళన చెందారు.

పరిశీలించిన ఇరు రాష్ట్రాల అధికారులు..

ఘటనా స్థలాన్ని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత సురాన మహావీర్, జిల్లా రవాణాశాఖాధికారి దుర్గా ప్రసాద్‌రెడ్డి, సాలూరు ఎంవీ జేపీఎస్ఎస్ఎస్ పరిశీలించారు. ప్రమాదానికి మెకానికల్, ఇతర కారణాలున్నయా? అని ఆరా తీశారు. ఒడిశా ఆర్టీసీ విజయనగరం డీఎం రవీం ద్రకుమార్ బెహరా, జయపురం డీఎం ఈశ్వర్ మహాపాత్రో కూడా ఘటనా పరిశీలించారు. బస్సు ఫిట్‌గానే ఉందన్నారు. అయినా ప్రమాదం సంభవించడంపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. దగ్ధమైన ఒడిశా ఆర్టీసీ బస్సుకు అన్ని పత్రాలు ఉన్నట్టు సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామన్నారు.

ప్రయాణికులకు భద్రతేదీ?

(3వ పేజీ తరువాయి)

పాచిపెంట మండలం రొడ్డవలస వద్ద దగ్ధమైంది. ఆంధ్రా-ఒడిశా ఘాట్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. అయితే, డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో ఒడిశా ఆర్టీసీ బస్సుల్లో ప్రయా ణం భద్రమేనా? అన్న ప్రశ్నలు అందరిలో తలెత్తుతున్నాయి.

ఒడిశా ఆర్టీసీకి చెందిన వివిధ బస్సులు ప్రతిరోజూ జిల్లా మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఒడిశాలోని జైపూర్, రాయఘడ, తదితర ప్రాంతాల నుంచి బయలుదేరి సాలూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల మీదుగా విజయనగరం, విశాఖపట్నంతో పాటు పర్లాకిమిడి ప్రాంతాలకు సాధారణ, ఎక్స్ ప్రెస్ సర్వీసులు నడుస్తుంటాయి. ఒడిశాలోని జైపూర్, కొరాపుట్, సిమిలిగూడ, రాయగడ, జేకేపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే జిల్లా ప్రయాణికులతో పాటు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఒడిశా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుంటారు. అయితే, ఇందులో చాలా బస్సులు పాతవి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల మీదుగా ఈ సర్వీసులు నడుస్తున్నాయి. ఆయా డిపోల పరిధిలో ప్రతిరోజూ 200మందికి పైగా ప్రయాణికులు ఒడిశా-ఆంధ్రాకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ బస్సుల్లో ప్రయాణికులకు భద్రత తక్కువగా ఉందనే విమర్శలు ఉన్నాయి. జైపూర్ నుంచి సాలూరు వరకు ఆ బస్సులు ఏ విధంగా వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒడిశా ఆర్టీసీ ఇటీవల కొత్తగా ప్రారంభించిన సర్వీసులు మినహా పాత సర్వీసులకు సంబంధించి కొన్ని బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఘాట్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్..

ఆంధ్రా-ఒడిశా ఘాట్ రోడ్డులో ఏదైనా ప్రమాదం జరిగితే గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. సాలూరు నుంచి సుమారు 40 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు ఉంది. ఒడిశా బస్సులతో పాటు ఆంధ్రా బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. భువనేశ్వర్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో రాత్రి సమయాల్లో ప్రయాణాలు చేసేవారు ఎక్కువగా ఉంటుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో అతివేగంతో ఘాట్ రోడ్డు వద్ద బస్సులు ప్రమాదాలకు గురవుతుంటాయి. దీంతో ఒక్కొక్కసారి సుమారు ఐదు, ఆరు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ సమయంలో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఒడిశా బస్సులపై జిల్లా రవాణాశాఖాధికారులు దృష్టి కేంద్రీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా వెళ్లే బస్సులను ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నాం. రొడ్డవలస వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి 2020-2021కు చెందిన బస్సు డ్రైవర్ అ ప్రమత్తంగా ఉండడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

- దుర్గా ప్రసాద్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి

వాడీవేడిగా..

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని బదులిచ్చారు.

చైర్మన్‌కు ఎమ్మెల్యే కౌంటర్..

పీపీపీ విధానం మార్చాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, అందుకే వివరంగా తెలియజేయాలని కోరుతున్నామని జడ్పీ చైర్మన్ కూటమి ప్రజాప్రతినిధులకు చెప్పగా విజయనగరం ఎమ్మెల్యే అదితి కలుగజేసుకుని 'అసలు మీకు కానీ, మీ పార్టీనేతలకు కాని పీపీపీ విధానం ద్వారా మెడికల్ విద్యార్థులకు ఎంతమంచి జరుగుతుందో తెలుసా' అని ప్రశ్నించారు. ఈ విధానం ద్వారా మెరుగైన వైద్యం లభిస్తుందన్నారు.

మంత్రి సంధ్యారాణి ఆగ్రహం..

మంత్రి సంధ్యారాణి మాట్లాడుతుండగా మన్యం జిల్లాకు చెందిన కొంతమంది సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించారు. అనారోగ్య సమస్యలతో చనిపోయిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదంతా సభలో గందరగోళం చేయడానికేనని భావించిన మంత్రి తీవ్రంగా స్పందించారు. 'ఇకనైన శవరాజకీయాలు మానుకోవాలని వైసీపీ నేతలకు హితబోధ చేశారు. పిల్లలు చనిపోతే ఎవరికైనా కడుపుకోత ఉంటుందని, మీకైనా..మాకైనా ప్రభుత్వం ఎంచేస్తుందో వేచి చూడకుండా వారి మరణాలను ఆసరాగా తీసుకుని ఇలా శవ రాజకీయాలు చెయ్యడం తగదన్నారు. గిరిజన కుటుంబాల్లో పుట్టిన పిల్లలు తమ పిల్లలతో సమానమని, వారికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణమే తమ ప్రభుత్వం స్పందిస్తోందని చెప్పారు. జ్వరాల బారిన పడి విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని, భవిష్యత్తులో గిరిజన విద్యార్థుల మరణాలు జరగకుండా దృష్టి సారిస్తామన్నారు.

మీరు ఆగండి..

గతంలో కంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన అద్భుతంగా ఉందని మంత్రి కొండపల్లి మాట్లాడుతుండగా మధ్యలో కలుగచేసుకోబోయిన జడ్పీచైర్మన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. మీరు అగండి అంటూ హార్ష్‌గా చెప్పారు. ముందు సభను ఆర్డర్‌లో పెట్టండని గట్టిగా కోరారు. దీంతో చిన్నశ్రీను సైలెంట్ అయ్యారు. సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే అవకాశం లేకుండా జడ్పీ చైర్మన్ కనుసన్నల్లో వైసీపీ సభ్యులందరికీ మైక్‌లు ఇచ్చి మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. మరో 32 మైక్‌లు ఇస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. సభ్యులంతా జిల్లా అభివృద్ధి కోసం చర్చిద్దామని, రాజకీయాలు మాట్లాడే వేదిక ఇదికాదని హితవు పలికారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యే లలితకుమారి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ తదితరులు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు రాంసుందర్‌రెడ్డి, డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, విజయనగరం జేసీ సేతుమాధవన్, జిల్లా పరిషత్ సీఈవో సత్యన్నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నందన్నా.. చల్లగా చూడు

- వడ్డి వీధిలో ఘనంగా అనుపోత్సవం
- వేడుకలకు హాజరైన రాష్ట్ర మంత్రి సంధ్యారాణి



నందన్న ఉత్సవాల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డీవీధిలో కొలువైన నందన్నకు గురువారం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. ఉత్సవ మూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనుపోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండ్ల వేషాలతో పాటు పలు కార్యక్రమాలను ఆమె తిలకించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏటా వడ్డి వీధికి చెందిన మజ్జి కుటుంబం నందన్నను ఏర్పాటు చేయడం, సుమారు 15 రోజుల పాటు శివపార్వతులు, నందన్నలకు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. స్వామివారి దయతో రాష్ట్ర ప్రజలు నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుకున్నట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట మజ్జి కుటుంబీకులు మజ్జి చిరంజీవి, మజ్జి నటరాజ్, 20వ వార్డు కౌన్సిలర్ మజ్జి శైలజ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలొగన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అభయహస్తం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు అభయ హస్తం వంటిదని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో నవగాం గ్రామానికి చెందిన స్వాతికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.29,348 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పోటీలు

సాలూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం మండల స్థాయి పోటీలను నిర్వహించినట్టు సాలూరు ఏటీడబ్ల్యూవో ఆర్.కృష్ణవేణి తెలిపారు. దేశభక్తి ప్రతిపాదికగా వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన, పోటీలను నిర్వహించామన్నారు. వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో..

●మక్కువ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో గురువారం ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. నియోజకవర్గం స్థాయిలో నిర్వ హించిన పోటీల్లో 9 ఆశ్రమ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ వాసుదేవరావు, ఎంపీడీవో అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాసరావు, వార్డెన్ పోలినాయుడు, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాలల పరిశీలన



విద్యార్థులతో ఆర్‌జేడీ విజయభాస్కర్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి.ఆమిటిలో మూతపడిన ఎయిడెడ్ పాఠశాలలను గురువారం జోన్-1 ఆర్‌జేడీ విజయభాస్కర్ పరిశీలించారు. దాంతో ఆయా గ్రామాల వారు పాఠశాలలు కచ్చితంగా అవసరమని ఆర్‌జేడీకి విన్నవించారు. దాంతో ఆయన వాటిని ప్రభుత్వ పాఠశాలలుగా మార్చడానికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానన్నారు. అనంతరం బుద్దిడి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆర్‌జేడీ మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు.

రైలులో తనిఖీలు

కొమరాడ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): కొమరారాడలో కుర్దా రోడ్డు నుంచి విశాఖ పట్నం వెళ్లే రైలులో గురువారం డాగ్ స్క్వాడ్, జీఆర్‌పీ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు.

ఎస్ఐ, ఏఎస్ఐ కుటుంబాలకు ఆర్థిక సాయం

సీతంపేట రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో మృతి చెందిన ఆరిక సింహాచలం కుటుంబాన్ని పోలీస్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షుడు కృష్ణనాయుడు, ట్రెజరర్ భుజంగరావు, సింహాచలం గురువారం పరామర్శించారు. మృతుడి స్వగ్రామం దేవనాపురం వెళ్లి కుటుంబసభ్యులకు డెత్ రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కు అందజేశారు. అలాగే మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన బగాది అప్పన్న కుటుంబ సభ్యులనూ అసోషియేషన్ సభ్యులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను డెత్ రిలీఫ్ ఫండ్ అందజేసారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోండి

సీతానగరం (బలిజిపేట), నవంబరు 6(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు కోరారు. గురువారం ఆయన తుఫాన్ ప్రభావిత 24 పంచాయతీల రైతులు, టీడీపీ నాయకులతో కలిసి తహసీల్దార్, మండల వ్యవసాయాధికారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజిపేట మండలంలోని వంతరాం, నూకలవాడ, గౌరీపురం, పి.చాకరాపల్లి, తదితర గ్రామాలకు రైతులకు చెందిన 2 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందన్నారు. రైతులను ఆదుకోవాలని అధికారులకు ఆయన కోరారు.

చెరువులనూ వదలట్లే!

(3వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని అధికారులు మాటలు చెప్పడమే తప్ప చేతల్లో మాత్రం చూపించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా సర్వేలు నిర్వహించడం, తర్వాత ఆ నివేదికలను తుంగలోకి తొక్కడం పరిపాటిగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వరహాల గెడ్డ ఆక్రమణలపై అప్పటి రెవెన్యూ, ఇరిగేషన్, ఇంజనీరింగ్, మునిసిపల్ అధికారులు సర్వేలు నిర్వహించారు. కొన్ని రికార్డులు లేకపోయినా పూర్వపు రికార్డులను తీసుకొని వచ్చి మరీ సర్వే చేపట్టారు. తరువాత ఏమైందో గానీ ఆ సర్వే నివేదికలను పూర్తిగా తుంగలోకి తొక్కారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా.. 'వరహాల గెడ్డ ప్రాంతాన్ని సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించే బాధ్యతను మునిసిపల్ అధికారులకు అప్పగించాం. రెవెన్యూ శాఖ ద్వారా సర్వేకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నాం. లంకెల చెరువు కూడా సర్వే చేస్తాం. నివేదిక వచ్చిన తర్వాత మా శాఖ ద్వారా తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు. ఇదే విషయమై ఇరిగేషన్ డీఈఈ ఉదయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా.. 'ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న చెరువులను సర్వే చేస్తున్నాం. వరహాల గెడ్డకు సంబంధించి ఆక్రమణలను గుర్తించాం.' అని తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది పెట్టకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని రోగులకు ఇంటికి పంపిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎన్ఎన్‌సీయూలోని గర్భిణులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పీటీజీ గర్ల్స్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని సందర్శించి డ్రైనేజ్, సిమెంట్ రోడ్డు త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. పీటీజీ గర్ల్స్ స్కూల్‌లో నూతనంగా నిర్మిస్తున్న డార్మెటరీని సందర్శించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ క్వాలిటీ విషయంలో రాజీపడకుండా చూడాలన్నారు. హాస్టల్ ప్రాంగణాన్ని సందర్శించి విద్యార్థులకు వండే భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

పార్వతీపురం రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): కోటవానివలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అడ్డాపుశీల వద్ద ఉన్న రైస్ మిల్లును సందర్శించి గోనె సంచులను పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సురేష్, మండల వ్యవసాయాధికారి అశోక్ ఉన్నారు.

డోలీ మోతల గ్రామాలపై నివేదిక ఇవ్వండి

కురుపాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని డోలీ మోతల గ్రామాలపై నివేదిక అందజేయాలని పంచాయతీరాజ్ ఈఈ జి.రవి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులలో ఆయన సమావేశమయ్యారు. రహదారి సౌకర్యాలు లేని గ్రామాలను గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. డోలీ మోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే మండలంలో 14 రోడ్లను మంజూరు చేసిందన్నారు. ఇంకా ఎక్కడైనా డోలీ మోతల గ్రామలు ఉంటే సమగ్ర నివేదిక అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిశోర్‌కుమార్

పార్వతీపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీకి కమిషనర్‌గా కె.కిశోర్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ గురువారం సాయంత్రం జీవో విడుదల అయిందని ఇన్‌చార్జి కమిషనర్, మేనేజర్ లక్ష్మి తెలిపారు. కిశోర్‌కుమార్ ప్రస్తుతం విశాఖ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

సంతకాల సేకరణలో కురుపాం టాప్



సంతకాల సేకరణ జాబితాను షర్మిలకు అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సెప్టెంబరు 15 అక్టోబరు 15 వరకు ఓట్ చోర్ గద్దీ ఛోడ్ అంటూ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో అరకు పార్లమెంట్ పరిధిలోని నియోజక వర్గాలన్నింటిలో కురుపాం టాప్‌గా నిలిచింది. దీంతో విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు జె.డి.శీలం, మస్తాన్‌వలీ ప్రశంసించారని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు.

ఐటీడీఏలో ప్రత్యేకంగా పీజీఆర్ఎస్

పార్వతీపురం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలో ప్రత్యేక ప్రజా మ స్య ల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) గిరిజనులు కోసం నిర్వహించాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి అధికారులను గురువారం ఆదేశించారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా వినతులు తీసుకొని వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు గిరి జనుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఐటీడీఏల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు.

పనులు వేగవంతం చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు వేగవంతం చేసి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో టిడబ్ల్యు ఇంజనీరింగ్‌శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు మల్టీ పర్పస్ సెంటర్ భవనాలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో టిడబ్ల్యూ పీఆర్ ఈఈలు రమాదేవి, లోకనాథం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వారానికి రెండు రోజులు పీజీఆర్ఎస్..

ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఇకపై వారికి రెండు రోజులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ప్రతీ సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో యధావిధిగా గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. దీంతో పాటు ప్రతీ శుక్రవారం కూడ పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి..

గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఉద్దేశించి పీవో మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్లస్టర్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీడీ అన్నాదొర, సూపరింటెండెంట్ అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యాప్రగతితో అభ్యాసన స్థాయి పెంపు

సీతంపేట రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులలో కనీస అభ్యాసన స్థాయిని పెంపొందించేందుకే విద్యాప్రగతి నూతన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. స్థానిక గిరిజనసంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యాప్రగతి కార్యక్రమాన్ని పీవో ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, సీఎంవో చిరంజీవులు, హెచ్‌డబ్ల్యూవో అమల పాల్గొన్నారు.

6 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ఏవోబీ కొండల్లో పట్టుబడిన బెల్లపు ఊట

సాలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏవోబీలో సారా, గంజాయి ఆచూకీ కోసం ఆయన గురువారం తెల్లవారు జామున కొఠియా గ్రూప్ గ్రామాలతో సహా గిరిశిఖర గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. అలాగే ఎక్సైజ్ సీఐ జి.దాస్ ఆధ్వర్యంలో ఆరు బృందాలు దాడులు చేశారు. ఎక్సైజ్ సీఐ దాస్ మారయ్యపాడు తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ పర్యవేక్షణలో బృందాలు కొఠియా గ్రూప్, ఇతర గిరిశిఖర గ్రామాలైన నేరేళ్లవలస, తాడివలస, జాకరవలస, దిగువరూడి, సంపంగిపాడు, తోణాం, దిగువ మెండంగి తదితర గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసి ఆరు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

సారా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

సీతంపేట రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): తాడిపాయి సమీపంలో గురువారం 20 లీటర్ల సారా తరలిస్తున్న కె.రాజారావు, కె.దుర్గారావులపై కేసు నమోదు చేసినట్లు దోనుబాయి ఎస్ఐ మస్తాన్ తెలిపారు. తాడిపాయి సమీపంలోని కొండ ప్రాంతంలో సారా రవాణా చేస్తున్నట్టు గుర్తించి వారిని పట్టుకున్నామన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ రత్నరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం నేపథ్యంలో పట్టణంలోని 1, 2, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20 వార్డులకు తాగునీటి సరఫరా చేయలేమని పేర్కొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి చర్యలు

సీతానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫస్టియర్ వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాభివృద్ధి కోసం పాలిటెక్నికల్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని జీజే కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ విద్యా కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం చెల్లన్నాయుడువలస పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ అధ్యాపకులు డి.రామకృష్ణ శిక్షణ ఇవ్వనున్నారన్నారు. శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

సీతానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జోగింపేట గిరిజన సంక్షేమ శాఖ గురుకుల ప్రతిభా పాఠశాలలో 69వ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ సౌజన్యంతో అండర్-14, ,17, 19 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు.

తహసీల్దార్‌గా అప్పారావు

జియ్యమ్మవలస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస తహసీల్దార్‌గా ఎస్.అప్పారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తానన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ముడుపుల పూజలు

సీతానగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరంలో వెలిసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ముడుపుల పూజలను నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా కావడంతో ఎస్ఐ ఎం.రాజేశ్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ లక్ష్మణరావు, హెచ్‌సీ తిరుపతిరావు బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

